


# గోల

పి.ఎస్. నారాయణ

గుంటూరు బస్ స్టాండులో జనం మంగళగిరి తిరణాలలో లాగా ఉన్నారు. లోపలికి వచ్చే బస్సులు వస్తున్నాయి. వెళ్లేవి వెళుతున్నాయి కిటకిట లాడుతూ.

విజయవాడ వెళ్లే బస్సు వచ్చింది. అది ఆగీ ఆగగానే ఊచలు పట్టుకొని పైకి లేచి కర్చీఫ్‌ను కిటికీలో నుంచి లోపల సీటు మీద పడేలా వేశాడు గుర్నాథం. తిరిగి వచ్చి లోపల ప్రయాణికులు అంతా దిగిందాకా తలుపు దగ్గర నిలబడి, జనాన్ని ఒక్క కుమ్ము కుమ్మి, లోపలకు జొర బడ్డాడు.

అతని వెనగ్గా తిరుమల రావు ఎక్కాడు.

తన జేబు రుమాల ఎక్కడ పడిందా అని చూచుకుంటూ చిన్నగా అడుగులు వేస్తున్నాడు గుర్నాథం. వెనగ్గా తిరుమల రావు తను పడేసిన బ్యాగ్ కోసరం చూస్తూ వస్తున్నాడు.

తన జేబు రుమాల కనబడగానే ఆ సీటు వైపు వెళ్లాడు గుర్నాథం. అక్కడే తన జేబు రుమాల మీదుగా ఓ చేతి సంచీ పడేసి ఉన్నది. చటుక్కున దాన్ని తీసి పక్కన పడేస్తూ ఆ సీట్లో కూర్చో బోయాడు గుర్నాథం.

వెనగ్గా వచ్చిన తిరుమల రావు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా, "బ్యాగ్ నాది. నేనే పడేశాను అక్కడ. ఆ సీటు నాది!" అరుస్తున్నట్లుగా అన్నాడు.

"ఆ జేబు రుమాల నేను పడేశాను. ఆ సీటు నాది!"

అప్పటికే ఆ బస్సులోకి సగం మందికి పైగానే జనం ఎక్కేశారు. ఇంకా ఎక్కుతున్నారు.

"కావాలంటే పక్క సీట్లో కూర్చో!" గుర్నాథమే సలహా ఇచ్చాడు.

"నాకు బస్సు బయల్దేరి నప్పటి నుంచీ డోకులు మొద లవుతయి. కిటికీ పక్కనే కూర్చోవాలి. నువ్వే కూర్చో ఆ పక్క సీట్లో!" విసుగ్గా అన్నాడుతిరుమల రావు. "లేక పోతే దిగిపో!"

"ఏందోయ్ ఆ బెదిరింపు! నేను ఇంకో సీట్లో కూర్చోను! ఈ బస్సు దిగను. ముందుగా జేబు రుమాల వేసింది నేను. కావాలంటే చూసుకో కింద జేబు రుమాల, పైన సంచీ ఉన్నయి. కనుక ఆ సీటు నాదే! ను వ్వెవ్వరికి చెప్పుకుంటావో చెప్పుకో పోయ్!"

"బెదిరిస్తున్నావా?"

"అదేం, మర్యాదగానే చెబుతున్నాను."

"నీ బోడి మర్యాద నాకు దేనికి గాని ముందు అడ్డం లే. నేను కూర్చోవాలి అక్కడ!"

"ఏవిటి నువ్వు కూర్చోవటం, బోడి కూర్చోవటం! ఇదుగో నీ బ్యాగ్ తీసుకుంటావా, లేక పోతే నన్నే తీసి అవతల పారేయ మంటావా?'' గుర్నాథం గంయ్‌మన్నాడు.

"దాన్ని ముట్టుకో చెబుతాను!" తిరుమల రావు కోపంతో వణికి పోసాగాడు.

"ఏం చేస్తావేం?"

"బాబూ! ఎందుకు అనవసరంగా తగువు లాడుకుంటారు? వెనకాల ఇంకా సీట్లు ఖాళీగా ఉన్నయి. ఒకళ్లు వెళ్లి అక్కడ కూర్చోండి" పక్క సీట్లో కూర్చున్న ఓ లావుపాటి ప్రయాణికుడు వెనగ్గా ఉన్న తిరుమల రావుకు ఓ ఉచిత సలహా పారేశాడు.

"అదేదో ఆ దేబె మొహానికి చెప్పండి!"

"ఏంటిరా కూశావ్? నాది దేబె మొహమా? నీది దేబె మొహం: మీ అమ్మది దేబె మొహం! మీ నాన్నది దేబె మొహం! నీ పెళ్లాంది దేబె మొహం! నీకు పుట్టిన పిల్లలవి దేబె మొహాలు!" గుర్నాథం గొంతు తార స్థాయి నందుకున్నది.

"లమ్డీ కొడుకా! ఏం కూశావురా? నీదీ, నీ వాళ్లవీ అడుక్కునే మొహాలు! మీ ఇంట్లో అంద రివీ అడుక్కునే మొహాలే! మీ వీధిలో వాళ్లవి, మీ పేటలో వాళ్లవీ గూడా!" చటుక్కున ముందుకు వచ్చి గుర్నాథం చొక్కా కాలర్ పట్టుకొన్నాడు తిరుమల రావు.

"చెయి తీయి! లేదా చెంప చెళ్లుమంటుంది!' చేయెత్తాడు.

"అనరీయ్! నీ గూబ గుంయ్ మనక పోతే నా పేరు తిరుమల రావే కాదు!"

పక్కన కూర్చున్న ఇద్దరు లేచి చెరో వైపు పట్టుకున్నారు చేతులు లేపకుండా.

వెనక నుంచి ఎవడో పెద్దగానే నసిగాడు - "ఒక ఫైటింగ్ గూడా చూసి చావనీయరు గదా ఈ దారిని పోయే దానయ్యలు! వాళ్ల సొమ్మేదో పోయినట్లుగా ఎక్కడ కొట్లాట మొదలయినా మేం ఉన్నాం అంటూ వస్తారు వీళ్లు!"

"ఇవతలకు రా ముందు, ఆ సీటు మీద నుంచి నీ కుళ్లు జేబు రుమాల తీసుకుని!" తిరుమల రావు ఒక్క లాగు లాగాడు గుర్నాథాన్ని.

"దొంగ వెధవ! నా జేబు రుమాల కుళ్లుదా? నీ బ్యాగేరా చచ్చిన పంది చర్మంతో కుట్టింది! వెధవ కంపూ అదీను! ముందు తీసుకు పో అవతలకి!"

"ఏఁవన్నావ్?" అంటూనే తన చేతుల్ని పట్టుకున్న చేతుల్ని ఒక్క విదిలింపు విదిలించి, ముందుకు లంఘించి, గుర్నాథం జుట్టు పట్టుకున్నాడు తిరుమల రావు.

గుర్నాథం తిరుమల రావు మెడ పట్టుకొని ఒక్క ఊపు ఊపాడు. వెనక్కు నెట్టాడు. ఆ నెట్టుడుకు అతగాడు వెళ్లి వెనకాల ఓ స్థూల కాయుం ఒళ్లోపడడంతో అతడు లబోదిబో ఘంటూ, ఒక్క తోపు తోశాడు. తిరుమల రావు స్ప్రింగ్‌లా ఒక్క ఉదుటున లేచి కాలెత్తి గుర్నాథం కడుపులో తన్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే డ్రైవర్ బ స్సెక్కాడు. వాళ్ల కొట్లాట చూచి పెద్దగా అరుచుకుం టూ వాళ్ల దగ్గరకు వచ్చాడు.

"ఏందయ్యా అది? ఏమైంది? కొట్టుకోవా లనుకుంటే బయటకు వెళ్లి కొట్టుకోండి! బస్సులో కొట్టుకున్నారా పోలీసుల్ని పిలుస్తాను!" పెద్దగా అరిచాడు.

"డ్రైవర్ గారూ, ఇటు చూడండి. ముందు ఈ సీట్లో నేను జేబు రుమాల పడేశాను. ఈ వెధవన్నర వెధవ నన్ను కూర్చో నీయక పోవడమే కాకుండా వాడి కాలితో నా కడుపులో తన్నాడు!" ఏడుపు గొంతుతో అన్నాడు గుర్నాథం.

"నేనునా బ్యాగ్ పెట్టా నండీ డ్రైవర్‌గారూ ముందుగా. ఈ ఛండాలం ముండాకొడుకు నా మెడ పట్టుకొని విరిచేసి, ఆ పెద్ద మనిషి మీదకు తోసేశా డండీ!" అన్నాడు ఉక్రోషంగా తిరుమల రావు. సానుభూతి అంతా తన వైపే ఉండాలీ అన్నట్లు ఒక సారి అందరి వంకా ఏడుపు ముఖంతో చూచాడు.

"అసలు మీరు టిక్కెట్లు కొన్నారా ముందు? కొట్టుకోవడం తోటే సరిపోయిందా?"

"కండక్టర్ వస్తేనే గదా టిక్కెట్లు కొనేటందుకు?'

జనం ఘొల్లున నవ్వారు.

"ఇక్కడకు కండక్టర్ రాడు. ఇది నాన్ స్టాప్ బస్సు. అసలు కండక్టరే ఉండడు. అక్కడ క్యూ ఉన్నది చూచారా, పాత గుంటూరు దాకా ఉన్నది. వెళ్లి ఆ క్యూలో నిలబడి కొట్టుకోండి! లేద బస్సులోనే కొట్టుకోవాలీ అనుకుంటే అదుగో ఆ ఖాళీ బస్సులో ఎక్కి కొట్టుకోండి! దిగండి దిగండి. వెధవ గోల!'

P

## జోక్

### తెలియదు మరి

తీవ్రంగా జలుబుతో బాధ పడుతున్న వృద్ధురాలిని పరీక్షిస్తున్నాడు డాక్టర్.

"చలి వచ్చినప్పుడు మీ పళ్లు గిట్ట కరుచుకుపోయి వణికాయా?" అని అడిగాడు డాక్టర్.

"ఏమో తెలియదు. అప్పుడు పళ్లను తీసి బల్లమీద పెట్టాను."